సాక్షి చిత్తూరు

ఆదివారం । 19 । అక్టోబర్ । 2025





## సార్ చెప్పారు.. గిఫ్ట్ బాక్స్ ఇవ్వు!

'సార్ చెప్పార్.. గిఫ్ట్ బాక్స్ ఇవ్వు.. లేకుంటే నెక్స్ట్ ఇయర్ నీకు లైసెన్స్ రాదు' అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. - IIలో



## ఆగని దాడులు

పులిచెర్ల మండలంలో ఏనుగుల దాడులు ఆగనంటున్నాయి. రోజూ ఏదో ఒక చోట దాడులు చేస్తూనే ఉన్నాయి. - IIలో



## వినోదం.. కావొద్దు విషాదం!

మొదలే వర్షాలు.. ఆపై సెల్ఫీలు.. రీల్స్ పేరుతో జలపాతాల వద్ద నిర్లక్ష్యం చేయొద్దని నిపుణులు సూచిస్తున్నారు. - IIలో

## న్యూస్‌రీల్

### స్త్రీలను అగౌరవపరిచేది టీడీపీ

- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి



కార్వేటినగరం : స్త్రీలను అవమానించే పార్టీ టీడీపీ అని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ధ్వజమెత్తారు. పుత్తూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం, ఏకత్వంలో భిన్నత్వం కలిగిన దేశమన్నారు. భారతీయ స్త్రీలు చీర, బొట్టు ధరించడం సంప్రదాయమన్నారు. కానీ టీడీపీ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ బహిరంగ సభలో తన కుమార్తె, గంగాధరనెల్లూరు నియోజవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కృపాలక్ష్మిని సభ్యసమాజం తలదించుకునేలా అసభ్యకరమైన తీరిలో చీర, బొట్టు, నగలు గురించి అవమానకరంగా మాట్లాడడం దారుణమన్నారు. కల్తీ మద్యం గురించి కృపాలక్ష్మి నిరసన తెలియజేస్తే పరుష పదజాలంతో మాట్లాడం సమంజసమేనా....? అని ప్రశ్నించారు. 'నీకు జన్మనిచ్చింది కూడా మాతృమూర్తే' అనే విషయాన్ని మరిచి వ్యంగంగా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండించారు. తాను అవినీతి, భూకబ్జా చేశానని ఆరోపించడం కాదు.. నిరూపించాలని సవాల్ విసిరారు. నోరు ఉంది కదా అని ఏది పడితే అది మాట్లాడొద్దని హితవు పలికారు.

### పచ్చనపల్లిలో పిడుగుల వాన




చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం, పచ్చనపల్లి ప్రాంతంలో శనివారం వేకువజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఈ తరుణంలో ఓ చెట్టుపై పిడుగు పడింది. దాని ధాటికి చెట్టు రెండుగా చీలింది. ఎవరికీ ఎలాంటి ప్రాణ హాని లేదు. మూడు రోజుల కిత్రమే అనంతాపురం గ్రామంలో ఓ విద్యార్థి పిడుగుపాటుకు మృతి చెందాడు. చెట్ల కింద ఉండొద్దని, సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని మండల అధికారులు సూచించారు.

పుంగనూరు నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు బరితెగించేశారు. పెత్తనాన్ని చేతిలోకి తీసుకుని పేట్రేగిపోతున్నారు. వలసల నివారణ కోసం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తున్నారు. పట్టపగలే యంత్రాలతో పనులు చేస్తూ కూలీల కడుపు కొడుతున్నారు. దొంగ మస్టర్లు సృష్టించి జేబులు నింపుకుంటున్నారు. అధికారులను బెదిరించి పబ్బం గడుపుకుంటున్నారు. మూగజీవుల సంరక్షణ, వృద్ధి కోసం ప్రవేశపెట్టిన గోకులం షెడ్ల నిర్మాణ పనులూ తమవారికే కట్టబెట్టేశారు. వాటిపైనే ఆధారపడ్డ పేద కుటుంబాలను వీధిన పడేశారు. తమ్ముళ్ల తీరు చూసి నియోజకవర్గ ప్రజలు ఔరా..! అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.



# కూలీల కడుపు కొట్టి.. తమ్ముళ్లకు పంచిపెట్టి!

| పుంగనూరు నియోజకవర్గంలో ఉపాధి పనులు | | | | |
|---|---|---|---|---|
| మండలం | పనుల సంఖ్య | కూలీల వేతనం (రూ.కోట్లల్లో) | మెటీరియల్ ఖర్చు (రూ.కోట్లల్లో) | మొత్తం (రూ.కోట్లల్లో) |
| పుంగనూరు | 1,208 | 5.40 | 3.40 | 8.8 |
| చౌడేపల్లె | 2,869 | 3.96 | 2.64 | 6.6 |
| సోమల | 3,442 | 7.32 | 3.67 | 10.99 |
| సదుం | 3,235 | 5.39 | 3.48 | 8.87 |
| పులిచెర్ల | 4,612 | 12.13 | 3.94 | 16.07 |
| రొంపిచెర్ల | 3,747 | 13.45 | 1.65 | 15.1 |
| మొత్తం | 19,113 | 47.65 | 17.42 | 65.07 |

### యంత్రం..ఇదిగో సాక్ష్యం

- పుంగనూరు నియోజకవర్గంలో కూలీలు చేయాల్సిన పనులను కూటమి నేతలు యంత్రాలతో చేసి, కూలీలు చేసినట్లు తప్పుడు రికార్డులు సృష్టిస్తున్నారు.
- పుంగనూరు మండలం, కుమ్మరనత్తం పంచాయతీ చెరువులో ఫారంపాండ్‌ను జేసీబీతోనే చేశారు.
- చదళ్ల చెరువులో చేపల కుంట, క్యాటిల్‌ఫామ్‌ను యంత్రాలతోనే చేశారు. ఇలా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో యంత్రాలతో పనులు చేసి కూలీల కడుపు కొడుతున్నారు.
- రొంపిచెర్ల, పులిచెర్ల, సోమల, చౌడేపల్లె, సదుం మండలాల్లో 90 శాతం మేరకు ఉపాధి పనులు జేసీబీలతోనే చేశారు.
- ఆ తర్వాత వాటిని కూలీలు చేసినట్టు రికార్డులు సృష్టించి జేబులు నింపుకున్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదు.



పుంగనూరు మండలం, కుమ్మరనత్తంలో యంత్రాలతో చేస్తున్న ఉపాధి పనులు



సదుం మండలంలో మంత్రాలతో ఉపాధి పనులు

### ఉపాధి పనుల్లో భారీ అవకతవకలు

- యంత్రాలతోనే పనులు
- పాత పనులకు కొత్త మెరుగులు
- తమ్ముళ్లకే గోకులం షెడ్లు
- చాలీచాలని పనులతో నెట్టుకొస్తున్న కూలీలు
- పుంగనూరు నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: పుంగనూరు నియోజకవర్గంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తెలుగు తమ్ముళ్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. కూలీల ద్వారా చేయాల్సిన పనులను పట్టపగలే యథేచ్ఛగా జేసీబీలు, హిటాచీలతో చేస్తున్నారు.

### గోకులం.. తమ్ముళ్లకే అగ్రతాంబూలం

పశు సంపద వృద్ధి, సంరక్షించాలనే ధ్యేయంతో అమలు చేస్తున్న గోకులం షెడ్లు తమ్ముళ్ల పరమయ్యాయి. పశువులు ఉన్న రైతులను గుర్తించి, వాటి సంఖ్య ఆధారంగా షెడ్లను గ్రేడ్ల వారీగా మంజూరు చేయాల్సి ఉంది. కానీ పుంగనూరు నియోజకవర్గంలో నిబంధనలు ఉల్లంఘించారు. కేవలం తెలుగు తమ్ముళ్లకు మాత్రమే గోకులం షెడ్లు అప్పగించారు. కొందరు పాత గోకులాలకు సైతం మెరుగులు దిద్ది బిల్లులు చేసి స్వాహా చేశారు.

మట్టిని ట్రాక్టర్లతో తరలించి బిల్లులు చేసుకుంటున్నారు. కూలీలే పనిచేసినట్లు తప్పుడు మస్టర్లు సృష్టిస్తున్నారు. అధికారులను బెదిరించి కూలీల ఖాతాల్లో వేతనాలు జమ చేయిస్తున్నారు. ఆపై వారి ద్వారా కోట్లాది రూపాయలు వసూలు చేసి జేబులు నింపుకుంటున్నారు. ఇది చాలదన్నట్టు గతంలో చేసిన పనులకు మెరుగులద్ది ఆ పనులకే మళ్లీ బిల్లులు చేసుకుంటున్నారు. పథకం ప్రారంభం నుంచి పనిచేస్తున్న సిబ్బంది తమకు అనుకూలంగా లేరని నిర్దాక్షణ్యంగా తొలగించేస్తున్నారు. తమకు అనుకూలమైన వారిని నియమించుకుని పబ్బం గడుపుకుంటున్నారు. పశువుల సంరక్షణ కోసం మంజూరు చేసిన గోకులాలు సైతం తమ్ముళ్లు వశం చేసుకున్నారు. గోవులు లేకపోయినా గోకులాల పేరిట దోచుకు తింటున్నారు.

### నియోజకవర్గంలో ఉపాధి ఖర్చు రూ.65.07 కోట్లు

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పుంగనూరు నియోజకవర్గంలో 2024–2025 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఉపాధి నిధులు రూ.65.07 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో కూలీల వేతనాల ద్వారా రూ.47.65 కోట్లు, మెటీరియల్ కంపోనెంట్ ద్వారా రూ.17.42 కోట్లు ఖర్చు చేశారు. ఆ నిధులతో నియోజకవర్గంలో మొత్తం 19,113 పనులు చేసినట్లు రికార్డులు సిద్ధం చేశారు.

పుంగనూరు మండలం, చదళ్లలో జేసీబీలతో చేసి, ట్రాక్టర్లతో మట్టిని అన్‌లోడ్ చేసిన తమ్ముళ్లు





# వైద్య విద్యను కాపాడుకుందాం!

- కోటి సంతకాల ప్రజాఉద్యమంతో సాధిద్దాం
- ఇందుకు ప్రతి కార్యకర్తా కంకణధారుడు కావాలి
- బెల్ట్ షాపులపై ఉన్న శ్రద్ధ.. వైద్య విద్యపై ఎందుకు లేదు?
- సీఎం చంద్రబాబును ప్రశ్నించిన మాజీ మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు: కోటి సంతకాల ప్రజాఉద్యమంతో వైద్య విద్యను కాపాడుకుందామని మాజీ మంత్రి ఆర్కే రోజా పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఏడీకే కల్యాణ మండపంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమంపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన విద్యను, వైద్యాన్ని అందించిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆయన పాలనలో మొత్తం 17 మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇందులో ఐదింటిని పూర్తిచేసి ప్రారంభించగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఈవీఎంల ద్వారా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం జగనన్నకు ఎక్కడ మంచి పేరు వస్తుందోనని అన్ని మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

### బెల్టుషాపులపై ఉన్న శ్రద్ధ.. మెడికల్ కాలేజీలపై లేదా?

గల్లీగల్లీలో బెల్ట్ షాపులు పెట్టడంపై ఉన్న శ్రద్ధ, మెడికల్ కాలేజీలపై ఎందుకు లేదని చంద్రబాబును మాజీ మంత్రి ఆర్కే రోజా నిలదీశారు. వైద్య విద్య ప్రైవేటీకరణను ప్రజాఉద్యమంతోనే అడ్డుకోవాలని, దీనికి ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త, నాయకుడు కంకణధారుడు కావాలని పిలుపునిచ్చారు. జగనన్న సీఎంగా తీసుకొచ్చిన పలు సంక్షేమ పథకాలను సైతం తుంగలో తొక్కిన కూటమి ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

### కోటి సంతకాలతో అడ్డుకుందాం

మెడికల్ కళాశాలల వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఎంత మేలు జరుగుతుందో ప్రజలకు వివరించి సంతకాలు చేయించాలని మాజీ మంత్రి రోజా సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా చేయించే కోటి సంతకాల పేపర్లతో జగనన్న మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులతో కలసి వెళ్లి గవర్నర్‌కు అందజేస్తారని తెలిపారు. తద్వారా వైద్య విద్యను ప్రైవేటీకరణ జరగకుండా కాపాడుకొందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎ.హరి, వైస్ చైర్మన్లు డి.జయప్రకాష్, డి.శంకర్, వైఎస్సార్‌సీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు ఏకాంబరం, రూరల్ పార్టీ అధ్యక్షుడు అన్నా లోకనాథం, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### 'సూపర్‌గా' మోసం!

సూపర్ సిక్స్ పేరిట ప్రతి ఒక్కరినీ మోసం చేశారన్నారు. ఆరోగ్యశ్రీ, చేయూత, ఆసరా వంటి పథకాలను అటకెక్కించారన్నారు. రైతు భరోసా కింద రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని, రెండేళ్లకు కలిపి రూ.40 వేలు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.5 వేలు ఇచ్చి మోసం చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో పబ్లిసిటీ ఎక్కువ పని తక్కువ అంటూ ఎద్దేవా చేశారు.



కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

# గర్జించిన కలం!

కలం గర్జించింది. వేధింపులపై గళం విప్పింది. జిల్లా వ్యాప్తంగా నిరసనలు మిన్నంటించింది. తప్పులెత్తి చూపితే సరిదిద్దు కోవాల్సింది పోయి కూటమి ప్రభుత్వం వేధింపులకు దిగడం ఏమిటని ప్రశ్నించింది. ప్రజాస్వామ్యంలో భావప్రకటనా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడం తగదని హెచ్చరించింది. సాక్షి మీడియాపై కక్ష సాధింపులు మానుకోవాలని హితవు పలికింది. లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని స్పష్టం చేసింది.

- 'సాక్షి'పై వేధింపులా?
- భగ్గుమన్న జర్నలిస్టులు
- భావ ప్రకటనా స్వేచ్ఛను హరించొద్దు
- హితవు పలికిన మేధావులు, ప్రజాసంఘాలు

పలమనేరు/కుప్పం: ప్రజాసామ్యంలో మీడియా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడం తగదని మేధావులు, ప్రజాసంఘాల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఏ ప్రభుత్వంలోనూ ఇలా కేసుల సంస్కృతి లేదని మండిపడ్డారు. కొన్ని రోజులుగా సాక్షి మీడియాపై జరుగుతున్న దాడులు, అక్రమ కేసులను ఎండగట్టారు. ఇలాంటివి ప్రమాదకరమని, వెంటనే ఉపసంహరించుకోవాలని హితవు పలికారు. పలువురు జర్నలిస్టులు నిరసనలు చేపట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

### సాక్షిపై అక్రమ కేసులు అప్రజాస్వామికం

సాక్షి పత్రిక, ఎడిటర్ ధనుంజయరెడ్డిపై అక్రమ కేసులు అప్రజాస్వామికమని కుప్పం పాత్రికేయుల బృందం స్పష్టం చేసింది. శనివారం కుప్పంలో నిరసన చేపట్టారు. కల్తీ మద్యంపై వరుసగా సాక్షి ప్రతికలో వస్తున్న కథనాలు చూసి జీర్ణించుకోలేక అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. కల్తీ మద్యం తయారీ దారులను వదిలి మీడియాకు సంకెళ్లు వేయాలనుకోవడం భావ్యం కాదన్నారు. 'సాక్షి'పై కక్ష సాధింపులు మానుకోవాలని హితవు పలికారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై అక్రమ కేసులు బనాయించడం, నోటీసులు ఇవ్వడం, విచారణ పేరుతో భయభ్రాంతులకు గురిచేయడం బాధాకరమన్నారు. ఇలాంటి వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని సూచించారు. అనంతరం ఆర్డీఓ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. కుప్పం విలేకర్లు వెంకటాచలం, హరినాథ్, సుబ్రమణ్యం, నాదముని, నాగరాజు, గణేష్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

### పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లా?

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు తగదని పలమనేరు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పేర్కొన్నారు. సాక్షి విలేకరులు, ఎడిటర్ ధనుంజయరెడ్డిపై వేధింపులకు నిరసనగా స్థానిక ఆర్‌డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం కార్యాలయ ఏవో కుమారస్వామికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాత్రికేయులపై కేసులు పెట్టడం ప్రజాసామ్యంలో ఎక్కడా లేదన్నారు. జర్నలిస్టులు రమేష్, మణి, ఆది, మునిరత్నం, దిలీప్, వేణు, అశోక్, మురళి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డీఓ కార్యాలయంలో వినతిపత్రాన్ని ఇస్తున్న పలమనేరు జర్నలిస్టులు



కుప్పం ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న కుప్పం జర్నలిస్టులు

### మీడియాపై కేసులా..?



ప్రజాసామ్యంలో నాలుగో స్తంభంలా పనిచేసే మీడియాపై కేసులు, విలేకరుల నోరునొక్కడం, పత్రికా కార్యాలయాలపై దాడులు మంచిది కాదు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ మాత్రం మీడియా నోరుకొక్కే ప్రయత్నాలు సాగుతున్నాయి. పోలీసులు సైతం నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉంది. – అబ్దుల్ సుభాన్, సౌత్ఇండియా మీడియాసెల్ సెక్రటరీ

### ప్రజల తరపున మాట్లాడకూడదా?



ప్రజల తరపున వారి సమస్యలను పత్రికలు ఎత్తిచూపాలి. ఎందుకంటే ప్రజాసామ్యంలో మీడియా చాలా ముఖ్యమైంది. ఏదేనీ సమస్యపై కథనం వెలువడితే దానిపై బాధితుల తరపున ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అంతేగానీ పత్రికపై కేసులు పెట్టడం ఎప్పుడూ లేదు. – సోమచంద్రారెడ్డి, జిల్లా మేధావుల ఫోరం కన్వీనర్

### వైరాలు తగదు...



నేను మూడు దశాబ్దాలుగా పత్రికా రంగంలో ఉన్నా. గతంలో ఎప్పుడూ ఇలాంటి కేసుల సంస్కృతి లేదు. మీడియాపై రాజకీయ వైరాలతో జర్నలిస్టులపై కేసులు పెట్టడం లాంటివి లేవు.
– సయ్యద్ మొహిద్దీన్, మాజీ పత్రికా సంపాదకులు, పలమనేరు

## క్లుప్తంగా

### ఆగని దాడులు



పూరేడు వారిపల్లె వద్ద ఏనుగులు తొక్కేసిన వరి

**పులిచెర్ల(కల్లూరు):** మండలంలో ఏనుగుల దాడులు ఆగనంటున్నాయి. శనివారం తెల్ల వారు జామున మండలంలోని పాతపేట, పూరేడువారిపల్లె చిట్టారెడ్డిపేట, పాళెం, కోట పల్లె పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలను నాశనం చేశాయి. పూరేడు వారిపల్లె వద్ద వరి పంటను తొక్కిపడేశాయి. అలాగే మామిడి కొమ్మలను విరిచేశాయి. దాదాపు ఏడు ఏనుగులు పంటలపై పడి సర్వనాశనం చేశాయి.

### చెరువులో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



డి.కె.పల్లి చెరువులో పడి మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

**కుప్పంరూరల్:** చెరువులో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కుప్పం మండలం, డి.కె.పల్లి వద్ద శనివారం చోటుచేసుకుంది. కుప్పం సీఐ శంకరయ్య మాట్లాడుతూ సుమారు 45 సంవత్సరాల వయసు గల వ్యక్తి చెరువులో మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గమనించి సమాచారం ఇచ్చారని తెలిపారు. మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టమ్ నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. మెరూన్ కలర్‌పై తెల్లటి చారల షర్టు ధరించి, బట్ట తల కలిగి ఉన్నాడని, ఎవరైన ఇలాంటి ఆనవాళ్లు కలిగిన వ్యక్తి కనబడక పోయి ఉంటే కుప్పం పోలీసులను సంప్రదించాలని సూచించారు.

### నేడు జిల్లా కార్యవర్గ సమావేశం

**చిత్తూరు కలెక్టరేట్:** ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని కణ్ణన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యవర్గ సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు, నిరుద్యోగ యువతకు ఉచిత కోచింగ్ తదితర సమస్యలపై చర్చిస్తామని వెల్లడించారు.

# సార్ చెప్పారు.. గిఫ్ట్ బాక్స్ ఇవ్వు!

**అధికారులకు పందారం.. ప్రజలపై పెను భారం**

- ఒక వైపు మామూళ్లు.. మరోవైపు టపాసుల గిఫ్ట్ బాక్సులు
- ప్రతిషాపు నిర్వాహకుడు కచ్చితంగా సమర్పించుకోవాల్సిందే
- అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్న అగ్నిమాపక, రెవెన్యూ శాఖలు
- నష్టపోతున్నామంటున్న నిర్వాహకులు
- వీటిని అధిగమించేందుకు రూ.500 బాక్సు రూ.3 వేలకు అమ్ముతున్న వైనం

- చిత్తూరు జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో రామ్‌నగర్ కాలనీకి చెందిన అమర్ అనే నిరుద్యోగి తాత్కాలిక టపాసుల దుకాణం పెట్టాడు. ఈ దీనికోసం బ్యాంకులో రుణం తీసుకుని రూ.20 లక్షల వరకు వెచ్చించాడు. అగ్నిమాపక, రెవెన్యూ శాఖల్లో అనుమతులు పొందే సమయంలో లంచం ఇచ్చుకోవాల్సి వచ్చిందని, అంతటితో ఆగకుండా టపాసుల గిఫ్ట్ బాక్సులు అడుగుతున్నారని ఆవేదన చెందుతున్నాడు. అధికారులు ఒక్కొక్కరూ వచ్చి సార్ చెప్పారు.. 30 గిఫ్ట్ బాక్సులు ఇవ్వు.. అంటూ భయాందోళన సృష్టిస్తున్నారని వాపోతున్నాడు. వీరితో పాటు ప్రజాప్రతినిధులు సైతం గిఫ్ట్ బాక్సులు తమ ఇళ్లకు పంపాలంటున్నారని, ఇంత మందికి ఇచ్చుకుంటూ వెళితే అసలు కూడా వచ్చేలా లేదని ఆవేదన చెందుతున్నాడు.

- చిత్తూరులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో అరుణ్ తాత్కాలిక టపాసుల దుకాణం పెట్టాడు. అనుమతులు ఇచ్చిన శాఖలకు మామూళ్లతో పాటు 50 నుంచి 100 వరకు టపాసుల గిఫ్ట్ బాక్సులు పంపాల్సి వస్తోందని చెబుతున్నాడు. ఇవ్వకపోతే మరోసారి అనుమతులు ఇవ్వమని బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోతున్నాడు. తెచ్చిన స్టాక్‌లో అధిక శాతం ఉచితంగా పలు శాఖల అధికారులకు ఇవ్వడం వల్ల ఆ నష్టాన్ని సంపాదించేందుకు రేట్లు పెంచి అమ్ముకోవాల్సి వస్తోందంటున్నాడు. ఎవ్వరికీ ఉచితంగా టపాసుల బాక్సులు ఇవ్వకపోతే తక్కువ రేట్లకే విక్రయించొచ్చని కుండబద్దలు కొడుతున్నాడు.



చిత్తూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో వెలిసిన తాత్కాలిక టపాసుల దుకాణాలు

**చిత్తూరు కలెక్టరేట్ :** దీపావళి రోజున టపాసులు కాల్చడం సంప్రదాయం. చిత్తూరు జిల్లా కేంద్రంతో పాటు, నగరి, జీడీ నెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం, పుంగనూరులో తాత్కాలిక టపాసుల దుకాణాలు వెలిశాయి. వీటికి అనుమతులు పొందే సమయంలో ముడుపులతో పాటు అగ్నిమాపక, రెవెన్యూ, మరికొన్ని శాఖలకు గిఫ్ట్ బాక్సుల టపాసులు ఉచితంగా ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడుతున్నారు. అలా ఇవ్వని దుకాణాలకు వచ్చే పండుగకు ఎలాంటి అనుమతులు ఇచ్చేది లేదంటూ భయపెడుతున్నాడు. ఒక్కొక్క శాఖకు 50 నుంచి 200 వరకు గిఫ్ట్ బాక్సులు ఇవ్వాల్సి వస్తోందని, వారితో పాటు ప్రజాప్రతినిధులకు అదనంగా మరికొన్ని ఇవ్వాల్సి వస్తోందని నిర్వాహకులు ఆవేదన చెందుతున్నారు.

**ఖరీదైన వెలుగుల పండుగ**

జిల్లాలో టపాసుల దుకాణాల ఏర్పాటుకు రెవెన్యూ, అగ్నిమాపక, ఇతర శాఖలకు ఎప్పటిలాగే ముడుపులు ఇవ్వాల్సి వస్తోందని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యాపారం మూడు రోజులు మాత్రమే ఉంటుందని, అది కూడా వర్షం కురిస్తే ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక్క దుకాణం నుంచి రూ.50 వేలకు పైగా వెచ్చించాల్సి వస్తోందని, ఈ ఖర్చులు మొత్తం చివరికి వినియోదారులపైనే నెడుతున్నామని వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఇచ్చే ముడుపులను పూడ్చుకునేందుకు అదనపు రేట్లను పెడుతున్నట్టు వెల్లడిస్తున్నారు.

**అందరికీ చెల్లింపులు**

ఈ ఏడాది జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో 36 వరకు టపాసుల దుకాణాలను ఏర్పాటు చేశారు. ప్రతి దుకాణం నుంచి రెవెన్యూ, అగ్నిమాపక, నగరపాలక శాఖలకు చెల్లింపులు చేయాల్సి వస్తోందని, అలాగే విద్యుత్, నీరు, భద్రతా సదుపాయాల పేరుతో అదనపు లెక్కలు చూపుతున్నారని వ్యాపారులు వెల్లడిస్తున్నారు. అంతేకాకుండా, ఇప్పటి వరకు లైసెన్సులు పొందిన వ్యాపారులు నష్టాలను భరించలేక తమ అనుమతులను తాత్కాలికంగా మరొకరికి రూ.30వేల నుంచి రూ.40 వేలకు విక్రయించినట్టు సమాచారం.

**ధరలపై పర్యవేక్షణ కరువు**

తాత్కాలిక దుకాణాల్లో అధిక ధరలకు టపాసులు విక్రయిస్తుంటే పర్యవేక్షించే నాథుడే కరువయ్యారు. నియంత్రించాల్సిన పలు శాఖల అధికారులు తమ జేబులు నింపుకుని.. గిఫ్ట్ బాక్సులు తీసుకుని పట్టించుకోకుండా ఉండిపోతున్నారనే విమర్శలున్నాయి. టపాసుల ధరలపై వినియోగదారులకు పెద్దగా అవగాహన లేకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా విక్రయిస్తున్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని అధిక ధరలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

### ప్రతి షాపు నుంచి ఇవ్వాల్సిందే!




జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో తాత్కాలిక టపాసుల దుకాణాలు పెట్టుకునేందుకు అనుమతులిచ్చారు. ఈ అనుమతులతో వారం రోజుల పాటు టపాసులు విక్రయించొచ్చు. చిత్తూరు జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో 36, నగరి, పుంగనూరు, పలమనేరు, కుప్పం, జీడీ నెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో 140 మొత్తం 176 తాత్కాలిక షాపులకు అగ్నిమాపక శాఖ అధికారులు అనుమతులిచ్చారు. వీటితోపాటు జిల్లాలో పర్మినెంట్ లైసెన్స్‌లు కలిగిన టపాసుల షాపులు 17 ఉన్నాయి. ఈ ఏడాది అనుమతులిచ్చిన ఆయా శాఖల అధికారులకు ప్రతి షాపు నిర్వాహకుడు కచ్చితంగా గిఫ్ట్ బాక్సులు ఇచ్చుకోవాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**చిత్తూరు కలెక్టరేట్:** ప్రస్తుతం సంవత్సరంలో అర్జున, మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న, ద్రోణాచార్య, రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రస్తుతం సంవత్సరానికి సంబంధించి అవార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ అవార్డులకు జిల్లాలో అర్హత ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హత ఉన్న వారు ఈ నెల 28వ తేదీలోపు www.dbtyas-sports.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

### 30న ముగియనున్న సైనిక్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తు

**తిరుపతి సిటీ:** 2026–2027 విద్యా సంవత్సరానికి సంబంధించి సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష దరఖాస్తులకు ఈనెల 30వ తేదీ చివరి గడువుని విశ్వం విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడే డాక్టర్ విశ్వనాథ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షలకు అర్హులని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని కోరారు. ప్రవేశ పరీక్ష విధానం, నమూనా ప్రశ్నలు, మాక్ టెస్టులు, కోచింగ్ వంటి మరిన్ని వివరాలకు వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ నవోదయ పోటీ పరీక్షల కేంద్రాన్ని సంప్రదించాలని, లేదా 8688888802/ 9399976999 నంబరులో సైతం సంప్రదించవచ్చని తెలిపారు. సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షల శిక్షణలో విశ్వం విద్యార్థులు గత కొన్నేళ్ల నుంచి అగ్రగామి సీట్లు సాధిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

# బైక్‌ను ఢీకొట్టిన కారు

- ఒకరి మృతి



తీవ్రంగా గాయపడ్డ సత్యప్ప

**శాంతిపురం:** కుప్పం–పలమనేరు జాతీయ రహదారిలో శాంతిపురంలోని పాలారు వంతెన వద్ద బైకును కారు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. కెనమాకులపల్లికి చెందిన వడ్డెర వెంకట్రామప్ప, సత్యప్పలు చికెన్ షాపుల ఎదుట ఉన్న ఇనుప సామాన్ల కొలిమిలో తమ పని ముగించుకుని బైకుపై వెనుదిరిగారు. వెనుక నుంచి వచ్చిన కారు వీరి బైకును ఢీకొట్టడంతో తల, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంకట్రామప్ప(57) అధిక రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తనతో పాటు ఉన్న సత్యప్ప(59) తీవ్రంగా గాయపడ్డాడు. 108 ద్వారా సత్యప్పను కుప్పం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును సమీపంలో వదిలేసి, అందులోని వ్యక్తులు పరారయ్యారు. ఈ కారులో మద్యం బాటిళ్లను గుర్తించిన కెనమాకులపల్లి వాసులు జాతీయ రహదారిపై బైఠాయించి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. పోలీసుల జోక్యంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. నిరసనకారులతో ఆందోళన విరమింపజేశారు.

### 23 నుంచి టెన్త్ పబ్లిక్ ఫీజుల చెల్లింపు

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల్లో పదో తరగతి విద్యార్థులు ఈ నెల 23 నుంచి పబ్లిక్ పరీక్షల ఫీజులు చెల్లించేందుకు అవకాశం కల్పించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర పరీక్షల విభాగం అధికారులు ఆదేశాలు జారీచేశారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ప్రతి విద్యార్థికీ తప్పనిసరిగా అపార్ ఐడీ ఉండాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎవరికైనా అపార్ ఐడీ లేకపోతే వెంటనే నమోదు చేయించేలా హెచ్ఎంలు చర్యలు చేపట్టాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించారు.

### చోరీకి పాల్పడ్డ ముద్దాయి అరెస్టు



**కుప్పం:** రామకుప్పం మండలం, చెల్దిగానిపల్లి గ్రామంలో పట్టపగలు ఓ ఇంట్లో చోరబడి చోరీకి పాల్పడ్డ ముద్దాయిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ పార్థసారథి తెలిపారు. శనివారం డీఎస్పీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమిళనాడు రాష్ట్రం, అంబూరు సమీపంలోని ఉదఎందిరం గ్రామానికి చెందిన రాజేంద్ర కుమారుడు గోడ్విన్ మోసెస్ రాజేంద్రన్ అలియాస్ కడిష్ రామకుప్పం, వి.కోట ప్రాంతాల్లో సంచరిస్తూ దొంగతనాలకు పాల్పడేవాడు. ఈ క్రమంలో వారం క్రితం చెల్దిగానిపల్లి గ్రామంలో ఓ ఇంట్లో చొరబడి 95 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. దీంతో పాటు గతంలో వి కోటలో జరిగిన దొంగతనం కేసులోనూ కడిష్ ముద్దాయిగా ఉన్నాడు. ఇతని వద్ద నుంచి 123.3 గ్రాముల బంగారు నగలు, కత్తి, రాడ్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఇతనిపై తమిళనాడులో ఇప్పటి వరుకు 30 కేసులు ఉన్నాయన్నారు. డీఎస్పీ వెంట సీఐ మల్లేష్‌యాదవ్, ఎస్ఐలు వెంకట మోహన్, నరేష్, శ్రీనివాసులు ఉన్నారు.

# మామూళ్లు అడిగిన ఎస్ఐ సస్పెన్షన్

- కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేసిన ఓ నాయకుడి అనుచరుడు


**చిత్తూరు అర్బన్:** చిత్తూరు నగరంలో టపాసుల వ్యాపారి నుంచి ఓ ఎస్ఐ మామూళ్లు అడగడం.. దాన్ని కాల్ రికార్డు చేసిన వ్యక్తులు కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఫలితంగా చిత్తూరు తాలూకా ఎస్ఐ మల్లికార్జునను సస్పెండ్ చేస్తూ ఎస్పీ తుషార్ డూడీ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. దీపావళి పండుగను పురస్కరించుకుని చిత్తూరులోని మామిడికాయల వ్యవసాయ మార్కెట్ యార్డులో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసి, ఇక్కడే టపాకాయల విక్రయాలు చేసుకోవడానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. అయితే పలువురు వ్యాపారుల నుంచి కూటమి పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు ఒక్కో దుకాణానికి రూ.1.5 లక్షల చొప్పున మామూళ్లు వసూలు చేసినట్లు ప్రచారం సాగింది. చిత్తూరు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇద్దరు బడా వ్యాపారులు ఎలాంటి బిల్లులు లేకుండా రూ.కోట్లలో టపాకాయలు విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ సారి కూటమి పార్టీకి చెందిన వ్యక్తులకే భారీ మొత్తం మామూళ్లు ఇచ్చేయడంతో.. పలు శాఖలకు చెందిన అధికారులకు ఏమీ చేరలేదని తెలుస్తోంది. దీంతో తాలూకా ఎస్ఐ మల్లికార్జున శనివారం ఓ వ్యక్తికి ఫోన్ చేసి.. ''ఏం బాషా, ఏమీ పట్టించుకోలేదు. మురకంబట్టులో ఎవరు ఏం చేస్తున్నారు మాకు తెలియదా..? మా మామూళ్లు మాకు ఇచ్చేయాలి కదా. స్టేషన్‌లో మేము కూడా అందరికీ ఇవ్వాలి కదా..' అని కొద్దిసేపు ఫోన్‌లో మాట్లాడాడు. వాట్సాప్‌లో ఈ సంభాషణ జరుగుతుండగా పక్కనే ఉన్న ఓ నాయకుడి అనుచరుడు ఈ మొత్తం సంభాషణను తన ఫోన్‌లో రికార్డు చేశాడు. ఆపై వెంటనే కాల్ రికార్డు చిత్తూరు కలెక్టర్, ఎస్పీలకు చేరవేశారు. దీనిపై ఎస్పీతో కలెక్టర్ చర్చించి.. క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని సూచించారు. వెంటనే తాలూక ఎస్ఐ మల్లికార్జునను సస్పెండ్ చేస్తూ ఎస్పీ డూడీ ఉత్తర్వులు జారీచేశారు. అయితే లాటరీ, మద్యం దుకాణాలు, పేకాట క్లబ్బులు, అక్రమ ఇసుక, గ్రానైట్ స్మగ్లింగ్ దారుల నుంచి నెల నెలా మామూళ్లు తీసుకుంటున్న పోలీసులు స్టేషన్లో దర్జాగా తిష్ట వేసి కూర్చుంటే.... కాస్త కూస్తో మంచి పేరున్న ఎస్ఐ మల్లికార్జున అవినీతి ఆరోపణల్లో చిక్కుకోవడం పోలీసుల శాఖలో చర్చనీయాంశంగా మారింది.



# వినోదం.. కావొద్దు విషాదం!

- భారీ వర్షాలతో జోరుగా ప్రవహిస్తున్న వాటర్‌ఫాల్స్
- ప్రమాదాలకు నిలయంగా పర్యాటక ప్రాంతాలు
- మూడు వాటర్‌ఫాల్స్‌లో ఎటుచూసినా మృత్యులోయలే
- ఇప్పటికి 14 మంది మృతి





ప్రమాదకరమైన సుడిగుండాలున్న కైగల్, గంగనశిరస్సు వాటర్‌ఫాల్స్

**పలమనేరు :** సరదాగా స్నేహితులతో కలిసి కొంతమంది ప్రకృతి అందాలను వీక్షించి పరవశిస్తుంటారు. మరికొందరు కుటుంబ సభ్యులతో కలిసి సంతోష సాగరంలో మునిగి తేలుతుంటారు. సెలయేళ్లు, జలపాతాలు, వాటర్ ఫాల్స్‌ను చూస్తూ ఎంజాయ్ చేస్తుంటారు. సెల్ఫీలు దిగుతూ.. ఫొటోలు తీసుకుంటూ సంబరపడి పోతుంటారు. ఇలాంటి సందర్భంలో అనుకోని ప్రమాదం ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపుతుంది. మొదలే వర్షాలు.. ఆపై రీల్స్.. సెల్ఫీల మోజులో పడి కన్నీళ్లు తెప్పించొద్దని నిపుణులు సూచిస్తున్నారు.

**కన్నీటి 'జలపాతం'!**

నియోజకవర్గంలోని పలు వాటర్‌ఫాల్స్ ప్రమాదకరంగా ఉన్నాయి. భారీ సుడిగుండాలు పలువురిని బలితీసుకుంటున్నాయి. తల్లిదండ్రులు పిల్లల పట్ల, యువకులు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుత వర్షాలతో కైగల్ దుముకురాళ్ల, కళ్యాణరేవులు, గంగన్న శిరస్సు, వైఎస్ఆర్ జలాశయాలు పొంగి ప్రవహిస్తున్నాయి. సుడిగుండాలతో ప్రమాదకరంగా మారిపోయాయి. ముఖ్యంగా కళ్యాణిరేవులు, కైగల్ వాటర్‌ఫాల్స్‌లోని మృత్యులోయ ఇప్పటికే పలువురిని పొట్టనబెట్టుకుంది. ఇక్కడి సుడిగుండం కారణంగా నీటిలోకి దిగితే మళ్లీ పైకి రావడం సులభం కాదు.

**ఏడేళ్లలో 14 మంది మృతి**

గత ఏడేళ్లలో పలమనేరు నియోజకవర్గంలోని కైగల్, కళ్యాణిరేవులు, గంగనశిరస్సు, వైఎస్సార్ జలాశయం, వీకోట మండలంలోని గిడుగు జలపాతాల్లో 14 మంది దకా నీళ్లల్లో మునిగి మృతి చెందారు. సంబంధిత జలపాతాల్లో సుడిగుండాలు, నదిలోపలి పరిస్థితులు తదితరాలు గురించి అవగాహన లేకనే ఈ ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు యువత సెలవుల్లో సరదాగా గడిపేందుకు అడవిలోని కొత్త ప్రాంతాలకు వెళ్లడం, అక్కడున్న ఫాల్స్‌లో దూకడం కూడా ప్రమాదాలకు కారణమే.

### యూ'మిస్'



యూనిస్ (ఫైల్)



యూనిస్ మృతదేహాన్ని నదిలో నుంచి తీసుకొస్తున్న సిబ్బంది

**పలమనేరు:** మండలంలోని కళ్యాణిరేవులు జలపాతంలో రీల్స్ మోజులో దూకి నీటమునిగిన పట్టణ వాసి యూనిస్(25) మృతదేహాన్ని పలమనేరు ఫైర్ సిబ్బంది శనివారం వెలికితీశారు. మూడు రోజుల క్రితం యూనిస్ స్నేహితులతో కలిసి జలపాతం వద్ద సెల్‌ఫోన్‌లో వీడియోలు తీసుకుంటూ భారీగా ప్రవహిస్తున్న వాటర్ ఫాల్స్‌లోకి దూకి ఆపై కనిపించకుండా పోయాడు. తమిళనాడుకు చెందిన పది మంది గజ ఈతగాళ్లు సైతం మృతదేహం కోసం ఎన్నో ప్రయత్నాలు చేశారు. తుదకు శనివారం మధ్యాహ్నం ఘటన జరిగిన ప్రాంతం నుంచి ముందుకు కిలోమీటర్ దూరంలో సుడిగుండంలో చిక్కుకుని రాతిబండలకిందనున్న యూనిస్ మృతదేహం పైకి తేలింది. డ్రోన్ ద్వారా నదిపై గమనించగా ఈ విషయం కనిపించింది. ఆ ప్రాంతంలోకి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. ఆపై స్థానిక ఆస్పత్రిలో పోస్టుమార్టం చేసి కేసు నమోదు చేస్తున్నట్టు సీఐ మురళీమోహన్ తెలిపారు. కాగా మృతదేహం కోసం స్థానిక ఫైర్ సిబ్బంది పడిన కష్టాన్ని పట్టణ వాసులు అభినందించారు.